తెలుగుకళా సమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో రు.250/-లు బహుమతి పొందిన కథ

# ఇగిరిపోని గంధం

కె. గోదావరి శర్మ



రాణీ,


కుశలమేనా, నీకు?

నీ ధ్యాసే నాకు. నువ్వు వెళ్ళి అప్పుడే మూడు రోజులయింది. ఇంకా మూడు రోజులే కదా అయిందీ అని హాస్యమాడుతున్నాడు సాయంకాలం మన మిత్రుడు రాధాకృష్ణ. అతనికెలా తెలుస్తుందీ రోజులంటే కేలండర్లో గడిచేవి కావని, విరహంలో గడవనివనీ! టైమంటే వాచీలు చూపించేదే కాక సైకలాజికల్ టైమ్ వేరే వుంటుందని అతనికెలా తెలుస్తుందీ, ఇంకా పెళ్ళీ పోట్లాటలూ పున—స్సంధానాలూ ఏమీ లేనివాడు?

సరే, అతడి సంగతి మనకెందుకు గానీ, మన ముచ్చట్లు ముచ్చటించుకుందాం.

చిట్టితల్లి ఏమంటూంది? నాన్న ముద్దు కావాలంటూందా? అయితేజవాబు 'యాజ్ పర్ ఒరిజినల్'. అంటే కృష్ణశాస్త్రిగారి పాటలోలాగే నన్నమాట.

నేను ఇలా రాస్తూంటే నీకు సరదాగా వుందా, కోపంగా వుందా? చదువుతున్నప్పుడు సరదాగా, పూర్తిచేశాక కోపంగానూ వుంటుందేమో! 'నేను మీ పక్కనే వున్నప్పుడు పెళ్ళాంలా ట్రీట్ చేసి కాస్త దూరం కాగానే ప్రియురాలికి రాసినట్టు ఉత్తరాలు రాసి కవిత్వం ఒలకబోస్తా'రని నీ ఫిర్యాదు కదూ! ఉత్తరాల్లోనూ, ఉత్తరాతల్లోనూ కాక చేతల్లోనూ, చేతుల్తోనూ చూపించమంటావు, ఆ ప్రేమ ఏదో! అంతేనా! నిజమే, నేనూ గమనించాను లేడా. ఏం చెయ్యను మరి? ఎదురెదురుగా వుంటే నీ బలహీనతలు నాకూ, నా బలహీనతలు నీకూ తెలిసిపోతూంటాయి. మనం ప్రేయసీ ప్రియుల్లా కాక— మొగుడూ పెళ్ళాల్లాగా, ఇంకా ఒక్కొక్కప్పుడు ఫార్మల్‌గా భార్యాభర్తల్లాగా గడపవలసి వస్తుంది. మన బలహీనతల్ని గమనించనట్టు నటించి స్వీట్ నథింగ్స్‌తో రోజులు గడిపెయ్యడం కష్టం. ఎదుటి వ్యక్తి బలహీనతల్ని క్షమించడం, లేదా ప్రేమించడం చెప్పినంత సులువు కాదు. దానికి మనకింకా మనసు పండాలి. శిక్షణ కావాలి.




అప్పుడప్పుడు ఇలాంటి శిక్షా కావాలి. మనిషి విలువైనా, వస్తువు విలువైనా దూరమైనప్పుడే కదా తెలిసేది! మన వాళ్ళు ఆషాఢాల్లోనూ, మూఢాల్లోనూ (మూఢం అన్నా మూర్ఖం అన్నా ఒకటేనంటావా!) దూరంగా వుండా లన్న నియమం బాగా దూరం ఆలోచించే పెట్టి వుంటారు. 'స్వీట్ ఆర్ ది యూజెస్ ఆఫ్ ఏడ్వర్సిటీ' అని కదా అన్నాడు షేక్స్‌పియరుడు! వెనకటికి ఓ ఆంగ్ల నాటకంలో ప్రియుడు తన ప్రియురాలితో, మొద ఓమో— ఐ లవ్ యూ ఇన్‌స్పైట్ ఆఫ్ యువర్ వీక్‌నెసెస్ అంటాడు. తరువాత— ఐ లవ్ యూ విత్ ఆల్ యువర్ వీక్‌నెసెస్ అంటాడు. తరవాత్తరవాత— ఐ లవ్ యూ ఓన్లీ ఫర్ యువర్ వీక్‌నెసెస్ అంటాడు. దట్ ఈజ్ ది వే ఆఫ్ ది వరల్డ్! మనం కూడా ఆ దశకి చేరుకోవాలంటే మనకి ఇంకా తరచుగా విరహ శిక్షా, శిక్షణా కావాలన్న మాట! ఔనంటావా, ఒద్దంటావా? కష్టాల సానమీద మనసుని మంచిగంధం చెక్కలా అరగ దీస్తేనే కదా, 'మనసు పరిమళించెనే... ఆహాహా... ఓహోహో...' అని పాడుకోవడానికి అర్హత?

గంధం అంటే గుర్తొచ్చింది— అసలు ఈ (పై చెప్పిన) జ్ఞానోదయం నాకెలా కలిగిందో తెలుసా? సరే, నువ్వెలాగా లేవు కదా అని ఏంతోచక ఇల్లు చక్కబెట్టడం ప్రారంభించేను నిన్న. పెద్ద ట్రంకుపెట్టె తీసి అందులో బట్టలూ పాతలూ బయటికి తీస్తూంటే అడుగున కనిపించాయి— ఏమిటో తెలుసా? కర్పూరపు దండలు! కర్పూరం హరించుకుపోయింది, దండలు మిగిలాయి.

రెండు చేతుల్లోనూ వాటిని తీసుకుని హృదయానికి హత్తుకుంటే ఒళ్ళు ఝల్లుమని, ఏం గుర్తొచ్చిందో తెలుసా? అయిదేళ్ళ క్రితం ఈ దండలే మన గుండెల మీద వుండి, మనం దగ్గరైనప్పుడు చిక్కుపడి, మన గాఢ పరిష్వంగంలో అవీ నలిగి మన శరీరాలకు కర్పూరపు మైపూత పూసిన మధుర క్షణం! మనసు సీతాకోక చిలక అయి అయిదేళ్ళ గతంలోకి తుర్రున ఎగిరిపోయింది!

ఇంకో చక్కటి సన్నివేశం గుర్తుచెయ్యనా నీకు? పెళ్ళి తంతు పూర్తయ్యాక మనిద్దరికీ హార్లిక్స్ ఇచ్చారు. తాగుతూ పెరట్లో పూలమొక్కల దగ్గర నిలుచున్నాం. ఓ పూల మొక్క చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఎగురు తున్నాయి రెండు తెల్లటి సీతాకోకచిలకలు.

"బాగున్నాయి కదూ?"

"ఊఁ."

"కవులు కదా మీరు, అవి ఎలా వున్నాయో వర్ణించి చెప్పండి చూద్దాం..."

"మధుపర్కాల్లో వధూవరుల్లా..."

నువ్వు నవ్వేవు. పగలే వెన్నెల కాసింది. నవ్వి, "కవిత్వానికి క్లుప్తత ప్రధానం, ఇంకా క్లుప్తంగా, ఒక్క మాటలో చెప్పలేరా?" అన్నావు నవ్వుతూ, నన్ను కవ్విస్తూ.

నేను తల గోక్కున్నాను. "నువ్వు చెప్పు."

"మనలా." కిలకిలా నవ్వేవు నువ్వు. వెన్నెలకి వోల్టేజి పెరిగింది...

ఇదంతా నువ్వు మరిచిపోయి వుంటావని కాదు. పుట్టింట్లో వుండి మరోసారి గుర్తుచేసుకుంటావని!

రాణీ, ఇప్పుడేవీ ఆ చిలక నవ్వులు? ఆ పరిమళాల గుబాళింపులు? నిజంగానే కర్పూరం హరించుకు పోయిందా? సీతాకోక చిలకలు ఎగిరిపోయాయా? మనకి మిగిలినవి ఏ వాసనా లేని చెమ్కీ దండలూ, ఆల్బంలో ఫోటోలూ మాత్రమేనా?

కాదు. కాకూడదు. కదూ?

ఔను. కలకాలం నిలిచి వుండవలసినది కర్పూర సౌరభం కాదు. మనసు పరిమళం. మనసు పరిమళిస్తున్నన్నాళ్ళూ తనువు పరవశిస్తూనే వుంటుంది. లేకపోతే ఇప్పుడు ఈ ఉత్తరం ఎలా సంభవం? కేవలం ఆ చెమ్కీ దండల్ని పట్టుకుని ఎందుకూ ఆ తన్మయత? ఫోటో ఆల్బం చూస్తే నా పెదవుల మీదకి చిరునవ్వూ, నీ చెంపల మీదకి అరుణ వర్ణమూ— ఎందుకూ? ఈ మహిమ మన ప్రేమది కాదూ? దైనందిన జీవితంలోని సమస్యల్ని, సాధారణత్వాన్నీ జయించి, నిత్య నైమిత్తికాల కతీతంగా, నిత్య నూతనంగా, పచ్చగా, పచ్చిగా, పిచ్చిగా నిలిచివుండేది మన ప్రేమ. కర్పూరానికి వాసననీ, ఫోటోలకి చరిత్రనీ ఇచ్చేది ఆ ప్రేమే. అది ఇగిరిపోని గంధం.

రాణీ, మన జీవిత కథని మామూలు మాటల్లో, ప్రొజేయిక్‌గా రాసుకోవద్దు మనం. ఉత్తమ కావ్య లక్షణా లన్నీ వుండాలి దానికి. మనం — కావ్యకర్తలం — ఇంటా బయటా జంటకవులవలె అంటిపెట్టుకుని తిరగాలి గాని, నువ్వు అక్కడా, నేను ఇక్కడానా? అందుకని ఒక పని చెయ్యి— ఈ ఉత్తరం అందగానే నా క్కాస్త బాగులేదని (!) మీ వాళ్ళతో చెప్పి, పెట్టె బేడా సర్దేసి, పిల్లదాన్ని చంకనేసుకుని బయలుదేరిపో. ఇల్లంతా కళ్ళు చేసుకుని ఎదురుచూస్తూంటాను నేను.

చిట్టితల్లికీ, చిట్టి-తల్లికీ బోలెడు స్వీట్సు (అంటే కాకినాడ కాజాలా? అంతకంటె తియ్యటివా? వెంటనే వస్తే తెలుస్తుంది!)

—నీ
రాజా



పరిశుభ్రముగా బాగుచేసిన పచారి సరుకులు
ఫ్యాన్సీ మరియు జనరల్ గూడ్సు, నీలగిరి కాఫీ పొడి, సుగంధ పరిమళ వక్కపొడి మరియు బాగుచేసిన నమ్మకమైన పాతబియ్యం హోమ్‌డెలివరి సౌకర్యము తో లభించును.
నేడే విచ్చేయండి!
విజయ దుర్గ కాఫీ & జనరల్ స్టోర్సు
కాళేశ్వరరావు రోడ్ (బీసెంట్ రోడ్ క్రాస్) గవర్నరుపేట, విజయవాడ-2 ఫోన్స్: SHOP: 73676, RESI: 65710
EXPRESS